# త్యాగమేరా జీవితం

జీవితానికి అర్థం ఏమిటని కంటపడ్డ ప్రతివాడ్ని అడిగి చూడండి. ఒక్కొక్కళ్ళూ ఒక్కో భాష్యం చెపుతారు.

దానికి తార్కాణం ఇరవై సంవత్సరాల తర్వాత ఇటీవల గుడి అరుగుమీద గురకపెట్టి నిద్రలాగిస్తూ దర్శనం ఇచ్చిన చిన్నప్పటి స్నేహితుడు చిన్నారావ్ ! గుర్తుపట్టి నిద్రలేపి ఏమిటి పరిస్థితి అనడిగా. అంతే ! ఆవురుమంటూ అంతా చెప్పుకొచ్చేడు. వాళ్ళావిడకి త్యాగాలు చేసే వాళ్ళంటే ఎంతో ఇష్టంట. వీడిమోజిస్టు రివర్సుట. అసలు మొదటి రాత్రి మొదలైందిట తంతు. ఆవిడ పాల గ్లాసు పుచ్చుకుని పొందిగ్గా సిగ్గుపడుతూ వచ్చి గుమ్మం దగ్గర ఆగిపోయి, సినిమాలో హీరోయిన్‌గా సిగ్గుతో నేలచూపులు చూస్తూ కాలి వేళ్ళని నేలకేసి పాముతూ నిల్చుండి పోయిందిట. వీడేమో వెనకా ముందు ఆలోచనే లేకుండా, ఆవిడ్ని చెయ్యిపట్టి లోపలికి లాగి, తలుపు భళ్లున మూసి గడియిపెట్టి పాలగ్లాసు అందుకుని గడగడా తాగేసాట్ట. అలా తొందర పడకుండా ఉంటుంటే నా బతుకు వేరే రకంగా ఉండేదేమో అని కూడా మధ్యలో ఫీలయ్యి, తర్వాత ఏం జరిగిందో చెప్పారు. వీడు సిగ్గనే మాటలేకుండా ఆ విధంగా పాలని సేవించటం చూసి ఆవిడ కూడా సిగ్గుని వొదిలేసి, ఆశ్చర్యంగా వీడి వంక చూస్తూ ' ఛీ – మీరింత స్వార్ధ పరులనుకోలేదు. పాలని నా కోసం త్యాగం చేస్తారేమో అనుకున్నా ' అంటూ తెల్లవారేదాకా చాలా ఇదయిపోయిందట. ఆ రోజు నుంచి మొదలుకుని ఇప్పటిదాకా ఈ త్యాగాల గోల ఇంట్లో ఎక్కువై పోయి గురుడికి మనశ్శాంతి, కరువైందట దేవాయలం అరుగులపైన అవి దొరుకుతాయని ఈ మధ్యనే ఉరేసుకుని అవతారం చాలించిన ఒక మిత్రుడు చెప్పగా ట్రయి చేస్తూ నా కంటపడ్డాట్ట. అసలీ పిచ్చి ఆవిడకి పుట్టింటి తరుపునించి సంక్రమించిందట. ఆవిడ తల్లిదండ్రులు పిల్లల్ని అలా పెంచారట. వాళ్ళంతా పోటీలుపడి త్యాగాలు చేసేసుకుంటారట. వాళ్ళింటికి ' త్యాగనిలయం ' అని పేరు వ్రాయించి పెట్టేరట. వాళ్ళ నాన్న చేసినన్ని త్యాగాలు ఆ ఊళ్ళో ఎవరూ చేయకపోవటంతో వార్ని ఆ ఊరి ప్రజలు ఘనంగా

సన్మానించుకుని ' త్యాగ కేసరి ' అని బిరుదు ప్రదానం చేస్తే , ఇంటి కొచ్చేలోపు బిరుదుని , శాలువాని గూడా త్యాగం చేసేసి శభాషని పించుకున్నాట్ట. అలాంటి చరిత్ర కలిగిన ఇంటి అడబడుచుట వీరి భార్య . కాపురానికి పంపిస్తూ కూతురితో పుట్టింటి పేరు నిలబెట్టమని కళ్ళనీళ్ళతో అడగ్గా అలాగే నాన్నా అంటూ ప్రమాణం చేసిందట. ఆ క్షణంనించి మాట నిలబెట్టుకోటానికి త్యాగపరంపర మొదలైందిట. ప్రేమ త్యాగాన్ని కోరుతుందని ఎవరో చెప్పాగా విని, ' నేనంటే నిజంగా మీకు ప్రేమైతే సరదాగా ఏదైనా త్యాగం చెయ్యండి ' అంటుంటే కాదన్లేక సిగరెట్టు, వక్కపొడి, వంకాయికూర , మధ్యాహ్నం వేళ నిద్రా ఇలా ఎన్నో త్యాగం చేసాట్ట. కాని ఎప్పటికప్పుడు పరగడుపేనట. భార్య గదాని కాస్త మెత్త పడితే త్యాగంచేయమని కాల్చుకుతింటోందిట. స్వార్ధంగాని, త్యాగం గానీ తగిన మోతాదులో వుండాలేగాని మితిమీరితే ఇబ్బందులు తప్పవ్ మరి !

------- అయ్యిపోయింది -------